ప్రజాశక్తి
మంగళవారం 20 ఆగస్టు, 2024
5
శ్రీకాకుళం



పోలీస్ శిక్షణా కేంద్రం సందర్శన



పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని తండేవలస వద్ద ఉన్న పోలీస్ శిక్షణా కేంద్రాన్ని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలోని సిబ్బంది వివరాలు, వారి విధి విధానాలపై ఆరా తీశారు. శిక్షణా తరగతి గదులు, పోలీసు బ్యారాక్స్, మైదానం, పరిసరాలను పరిశీలించి పరి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నూతన చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ప్రస్తుత సామాజిక పరిస్థితులు, ప్రజలతో ఎలా ప్రవర్తించాలి, నీతి, నైతికత యొక్క ప్రాముఖ్యత, శిక్షణలో నేర్చుకున్న చట్టాల అమలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, సైబర్ భద్రత తదితర అంశాలపై వివరించారు. ఈయన వెంట ఎస్‌బి ఖాదర్ బాష, శిక్షణా కేంద్రం సిబ్బంది ఉన్నారు.



'ఉపాధి'కి ఊతం

- కొత్త పనులకు ఆమోదం
- వ్యవసాయ అనుబంధ రంగాల పనులకు ప్రాధాన్యం
- ఉపాధి చట్టం లక్ష్యాలు, కూలీల హక్కులపై అవగాహన
- 23న ఉపాధి పనుల నిర్వహణపై గ్రామసభలు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్ఇజిఎ) పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కూలీల హక్కులు, సౌకర్యాలను తెలియజేయడంతో పాటు ఇప్పటివరకు చేసిన పనులను గ్రామీణులకు వివరించనున్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో చేపట్టనున్న పనులను గుర్తించి సభ ఆమోదం తీసుకోనున్నారు. జిల్లావ్యాప్తంగా ఒక్కరోజులోనే గ్రామసభలను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. గ్రామసభల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఇదివరకే ప్రత్యేక మార్గదర్శకాలను వెలువరించింది. సభల నిర్వహణకు జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 4.3 లక్షల మందికి జాబ్‌కార్డులను జారీ చేశారు. వీటిలో 3.79 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. జారీ చేసిన జాబ్‌కార్డుల్లో 7.36 లక్షల మంది సభ్యులుగా ఉండగా, 6.03 లక్షల మంది కూలీలు క్రమం తప్పకుండా పనులకు వస్తున్నారు. ఉపాధి హామీ చట్టంపై కూలీలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి పల్లెలో సభలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి చట్టంలోని ముఖ్య అంశాలు, కూలీల హక్కులను ఇందులో వివరించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపడుతున్న పనులను వివరించనున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొత్తగా చేపట్టబోయే పనులను గ్రామసభ ముందుంచనున్నారు. ఉపాధి హామీ చట్టం అమల్లో పారదర్శకత, బాధ్యత పెంచేందుకు సోషల్ ఆడిట్ ఏవిధంగా ఉపయోగ పడుతుందో కూలీలకు అవగాహన కల్పించను న్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపునకు చట్టం ఏవిధంగా ఉపయోగపడుతుందో తెలియజేయనున్నారు.

సభల నిర్వహణపై ప్రత్యేక మార్గదర్శకాలు

గ్రామసభల నిర్వహణకు సంబంధించి ఏ గ్రామంలో ఎప్పుడు సభ పెట్టనున్నారో టాం టాం ద్వారా పంచాయతీ సిబ్బంది తెలియజేయనున్నారు. గ్రామసభకు రెండు రోజుల ముందు ఎన్నికైన ప్రజాప్రతినిధులు, రైతులు, కూలీలు, మేట్‌లు, ఎన్‌జిఒలకు సమాచారం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. పంచాయతీలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ గ్రామంలో చేపడుతున్న పనుల వివరాలను గ్రామంలో ప్రదర్శించాలని పేర్కొంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, వ్యక్తిగత ప్రయోజనం కల్పించే పనులపై శ్రద్ధ చూపాలని ఆదేశించింది. గ్రామసభల నిర్వహణ ఖర్చుల కోసం ప్రభుత్వం ప్రతి పంచాయతీకి రూ.వెయ్యి ఇవ్వనున్నట్లు తెలిపింది.

వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం

ఉపాధి హామీ చట్టం ద్వారా ఈ ఏడాది వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం 46 రకాల పనులకు అనుమతించారు. పీడర్ కాలువ నిర్మాణం, కొత్త పంట కాలువల తవ్వకం, పూడికతీత, నర్సరీల పెంపకం, పశువులు రాకుండా రక్షణ కందకాలు, రైతుల్లో భూముల్లో కుంటల నిర్మాణం, భూమి చదును పనులను చేపట్టనున్నారు. వ్యక్తిగత భూముల్లో వ్యవసాయ బావుల నిర్మాణం, పొలాల్లో గడ్డి పెంపకం, మడ అడవుల పెంపకం, గొర్రెలు, పశువుల షెడ్లు, కోళ్లఫారాల నిర్మాణం వంటి పనులనూ చేపట్టనున్నారు. వీటిలో ఇప్పటికే కొన్నిరకాల పనులను జిల్లాలో చేస్తున్నారు. గ్రామాల్లో చేపడుతున్న పనులతో పాటు చేయబోయే పనులపై గ్రామసభల ఆమోదం తీసుకుని పనులు నిర్వహిస్తారు. ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు వస్తే పరిగణనలోకి తీసుకుని పరిష్కరిస్తారు.

ఉపాధి చట్టం అమలు అంతంతమాత్రమే

కేంద్రంలోని యుపిఎ–1 ప్రభుత్వం 2005లో ఎంజిఎన్‌ఆర్‌జిఎ చట్టాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో 2006 ఫిబ్రవరిలో అనంతపురం జిల్లా బండ్లపల్లిలో తొలిసారి ప్రారంభించారు. చట్టం అమల్లోకి వచ్చి 18 ఏళ్ల అవుతున్నా చట్టాన్ని పూర్తిస్థాయి అవగాహన కల్పించడంలో పాలకులు విఫలమయ్యారు. పని కోరిన 15 రోజుల్లో పని ఇవ్వకపోతే ప్రభుత్వం భృతి చెల్లించాల్సి ఉన్నా, ఆ నిబంధననూ ఏనాడు అమలు చేయలేదు. పని ప్రదేశం నివాస ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉంటే రోజు కూలికి అదనంగా పది శాతం ఇవ్వాల్సి ఉన్నా, ఎక్కడా అమలు కావడం లేదు. కనీస కూలి రూ.300 దక్కాల్సి ఉన్నా, గరిష్ఠంగా రూ.250కు మించి రాని పరిస్థితి ఉంది. కూలి డబ్బులు సకాలంలో చెల్లించకపోతే పరిహారం కలిపి డబ్బులు ఇవ్వాలి. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స పెట్టె, తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. పని ప్రదేశంలో కూలి మరణించినా, పూర్తిగా అంగవైకల్యానికి గురైనా రూ.50 వేలు ఇవ్వాల్సి ఉన్నా ఆ డబ్బులనూ ఇస్తున్న పరిస్థితి లేదు.

గ్రామసభలు నిర్వహించాలి

ఉపాధి హామీ పనులను గుర్తించేందుకు ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలను నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఈ సందర్భంగా అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉత్పాదకత పెంపు, ప్రజలకు, రైతులకు ఉపయోగపడే విధంగా ఈ పనులు ఉండాలని సూచించారు. సుమారు 46 రకాల పనులను ఈ పథకం కింద నిర్వహించే అవకాశం ఉందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఇఒ వెంకట్రామన్, డిపిఒ వెంకటేశ్వరరావు, డుమా పీడీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందజేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

క్రీడలకు ప్రభుత్వాలు పెద్దపీట

- 2028కి రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహణ
- కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి – శ్రీకాకుళం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు పెద్దపీట వేస్తున్నాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 11వ అంతర్ జిల్లాల జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధే లక్ష్యంగా సన్నాహాలు ప్రారంభించినట్లు తెలిపారు. 2028లో రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. జిల్లాల్లో క్రీడా అకాడమీలు ప్రారంభించి, రాష్ట్రాన్ని క్రీడా హబ్‌గా మార్చాలన్నదే చంద్రబాబు విజన్ అని చెప్పారు. క్రీడలకు, జిల్లాకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ, జాతీయస్థాయి పోటీల్లో రాణించి దేశానికే ఖ్యాతిని తీసుకొచ్చారని గుర్తుచేశారు. జిల్లాలో అన్ని క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన తర్వాతే ఆయా క్రీడాకారులకు గుర్తింపు ఉంటోందని, అలాకాకుండా క్షేత్రస్థాయి నుంచే సరైన సౌకర్యాలు కల్పిస్తే వారి ప్రతిభాపాటవాలు వెలుగుచూసి మెరుగ్గా రాణిస్తారని తెలిపారు. క్రీడాకారులకు రైల్వే శాఖ ఇచ్చిన 75 శాతం ప్రయాణ రాయితీ పునరుద్ధరణకు కృషి చేస్తానన్నారు. నేటి యువత క్రీడలపై ఆసక్తి చూపేలా మానసికంగా, శారీరకంగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.

ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కోడి రామ్మూర్తి స్టేడియం పునరుద్ధరణ పనులు వేగవంతం చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై మక్కువ కలిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం బాలురు, బాలికల విభాగాల్లో విజేతలకు కేంద్ర మంత్రి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ శ్రీధర్, పి.సుందరరావు, సాంబమూర్తి, రాజు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి బి.వి రమణ, ఎం.వి రమణ, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, మేనేజర్స్, పిఇటిలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సోదరభావం పెరగాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చందు

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్



ఎస్‌పికి రాఖీ కడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సోదరభావాన్ని పెంపొందించడానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.చందు, బాలికల విభాగం కన్వీనర్ పవిత్రలు అన్నారు. సోమవారం రక్షాబంధన కార్యక్రమంలో భాగంగా ఎస్పి కార్యాలయంలో ఎస్పి కె.వి.మహేశ్వర రెడ్డిని కలిసి రాఖీ కట్టి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి విద్యార్థినిలను అభినందించారు. అనంతరం నగరంలో వివిధ కూడళ్లలో ట్రాఫిక్ విధుల్లో ఉన్న పోలీసులకు, అగ్నిమాపకశాఖ కార్యాలయాల్లో సిబ్బందికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలపై చిన్నచూపు, అణిచివేత, అత్యాచారాలు పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను సోదర భావంతో చూడాలే తప్ప... నైతికతను మరచి దారునాలకు తెగబడడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మరో వైపు కుల, మతం, వివక్షత పెరుగుతోందన్నారు. నైతిక విలువలతో కూడిన సమాజం వృద్ధి చెందాలన్నారు. సోదరభావం పెంపొందించుకునేందుకు ఎస్ఎఫ్ఐ రక్షాబంధన్ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తిరుపతి, సంతోష్, మోహిని, రవి, నాగేష్ పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధితోనే ఆర్థిక ప్రగతి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

పారిశ్రామికాభివృద్ధితోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధ్యమని, అందుకోసం పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ డిఐఇపిసి సభ్యులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీలతో సోమవారం సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పారిశ్రామిక విధానం 2024–29లో భాగంగా ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించామని, పరిశ్రమలే జిల్లా ఆర్థిక ప్రగతికి ఆయువుపట్టు అని ఆదిశగా జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలోకి తీసుకు రావాలని అన్నారు. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమలశాఖ, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐడిపి)లను అనుసరించి జిల్లాలో అన్ని సెక్టార్లలో అభివృద్ధికి గల అవకాశాలను పరిశీలించాలని వివరించారు. జిల్లా పరిశ్ర మల జనరల్ మేనేజర్ జె.ఉమామహేశ్వరరావు సంబంధిత వివరాలను సమావేశంలో కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, శ్రీకాకుళం ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణిమోహన్, ఎల్‌డిఎం సూర్యకిరణ్, పరిశ్రమల శాఖ ఎడిలు రమణారావు, రఘునాథ్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్లు రావణబ్రహ్మ, దిలీప్‌కుమార్, రవికుమార్, జయ, రమాదేవి, గోవిందరాజులు పాల్గొన్నారు.

రేపట్నుంచి ఎస్ఎస్ఆర్ సర్వే

జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న డిఆర్ఒ అప్పారావు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఆదేశాల మేరకు, జిల్లాలో ప్రత్యేక సమ్మరీ రివిజన్ 2025 షెడ్యూల్ కోసం బుధవారం నుంచి ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి ఎం.అప్పారావు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి ఉపాధ్యాయ ఓటర్ల నమోదు కోసం సెంబరు 30న షెడ్యూల్‌ను విడుదల చేస్తామని చెప్పారు. అలాగే 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా బుధవారం నుంచి జరిగే ఇంటింటా సర్వేలో బూత్ లెవెల్ ఆఫీసర్లు అవగాహన కల్పిస్తారన్నారు. సాధారణ కొత్త ఓటర్ల నమోదుకు, బదిలీకి, చిరునామా మార్పునకు, ఫొటో మార్చుకు నేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో సిపిఎం నుంచి రట్టి ప్రకాశరావు, టిడిపి నుంచి పిఎంజె బాబు, వైసిపి నుంచి రౌతు శంకరరావు, బిఎస్‌పి నుంచి లాస సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వలసలను నివారించాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి– నందిగాం



సాగునీటి వనరులు సక్రమంగా లేక రైతులు రైతు కూలీలు వలసబాట పడుతున్నారని, ప్రభుత్వం దీనిని నివారించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు అన్నారు. ఈ మేరకు నందిగాంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రైతు నిలబడాలంటే ప్రభుత్వాలు విత్తనాలు, ఎరువులు, సాగునీరు, బ్యాంకు రుణాలు, పంటలకు మద్దతు ధర పెంచాల్సిన అవసరమై ఎంతైనాలుందన్నారు. ఇవి లేని పక్షంలో రైతులకు వ్యవసాయం చేయడం కష్టతరంగా మారుతుందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి దశాబ్దాలు గడిచినా పూర్తి చేయకపోవడం రైతులకు ఇబ్బందులు గురిచేస్తుందన్నారు. 2008లో ప్రారంభించిన నందిగామ మండలానికి సాగునీరు అందించే ఆఫ్‌షోర్ రిజర్వాయరు ఇప్పటికీ ఆ పనులకు అతీగతీలేదన్నారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు అందించాల్సిన సాగునీరు ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం నిర్మించారన్నారు. కాలువ పనులకు కనీస మరమ్మతులు చేపట్టలేదన్నారు. 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సిన సామర్థ్యం కలిగి ఉన్నా... కేవలం 1300 క్యూసెక్కుల వరకే నీటిని విడిచిపెట్టి చివరి ప్రాంతాలకు సాగునీరు అందించలేక పాలకులు అధికారులు చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. శివారు ప్రాంతాలకు నిరంతరం అంటే కాలువల సామర్థ్యానికి సరిపోయినంత నీటిని విడుదల చేయాలని విత్తనాలు ఎరువులు సబ్సిడీపై అందించాలని, ఇవేవీ అందక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. 1బిలు సక్రమంగా రాకపోవడంతో భూములు కలిగి ఉన్న రైతులకూ బ్యాంకు రుణం పొందలేక ఆర్థిక ఇబ్బందులతో ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల ఆశ్రయించి అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి వ్యవసాయం చేయక తప్పడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తామని ప్రకటన గుప్పించినా... నేటికీ అది చట్టం చేయకపోవడంతో రైతు కష్టాలు తప్పడం లేదని అన్నారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్

తప్పుడు నివేదికలు ఇస్తే చర్యలు

- 'మీకోసం' వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- రీసర్వే లోపాలు సరిదిద్దాలని రైతుల వినతి

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

ఒకే సమస్య పరిష్కారం కాలేదని బాధితులు పదేపదే వచ్చి వినతులు ఇస్తున్నారని, సమస్యలు పరిష్కరించకుండా క్షేత్రస్థాయిలో ఉద్యోగులు సమస్య పరిష్కరించినట్లు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని, అటువంటి నివేదికలు ఇస్తున్న అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం వినతుల నివేదికలపై పిఎస్ఆర్ అనే కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందని సమాధానాలు ఇస్తే ఒకే సమస్యపై దపదపాలుగా ఫిర్యాదులు వస్తాయని పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహనరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌లు సోమవారం వినతులు స్వీకరించారు. ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి తోటపాలెం భూముల ఆక్రమణలపై ఫిర్యాదు అందజేశారు. గత వారం మీకోసంలో కూడా ఇదే ఫిర్యాదు ఇచ్చారని, ఒకే ఫిర్యాదు పలుమార్లు ఇవ్వడంపై సమయం వృథా అవుతుందని అన్నారు. అయితే చిరంజీవి జోక్యం చేసుకుని ఇచ్చిన ఫిర్యాదులు క్షేత్రస్థాయిలో పరిష్కారం కావడం లేదని, మొక్కుబడిగా సమాధానం ఇవ్వడంతో సమస్య పరిష్కారం కాదని ప్రస్తావించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ... ఎచ్చెర్ల తహశీల్దారు ఇచ్చిన సమాధానంతో కూడిన నివేదికను సమర్పించాలని ఆర్‌డిఒను ఆదేశించారు. లావేరు, సంతబొమ్మాళి, కంచిలి, వజ్రపుకొత్తూరు, పలాస మండలాలకు చెందిన పలువురు రైతులు తమ భూముల రీసర్వేలో తప్పులు చోటు చేసుకున్నాయని, పాత పాసుపుస్తకాలతో ఉన్న విస్తీర్ణం సరిదిద్దాలని కోరారు. అలాగే సర్వే సమయంలో పాసుపుస్తకాల్లో పేర్లు తప్పుగా నమోదై ఉన్నాయని, 1బి , అడంగల్ ప్రాప్తికి పాసుపుస్తకాలు లేవని వివరించారు. అలాగే గ్రామకంఠాలను ప్రభుత్వ భూములుగా చూపిస్తున్నారని, హక్కు దారులుగా ఉన్న రైతులకు అన్యాయం జరుగుతోందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 130 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శనదొర, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టిరాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఇ రాంబాబు, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాదరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి

సమస్యలను పరిష్కరించాలి

ఎస్‌పి మహేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదు, నమోదు, పరిష్కార వేదికలో ప్రజలు వినతుల ద్వారా తెలిపే ప్రజా సమస్యలను చట్ట పరిధిలో పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర్ రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఎస్‌పి 46 మంది ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించి ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సానుకూలంగా స్పందించిన ఎస్‌పి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను కార్యాలయానికి అందించాలని అధికారులకు సూచించారు.



డంపింగ్ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- బూర్జ

ఇసుకను అక్రమంగా తరలించేందుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ ఈశ్వరమ్మ స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని నాగావళి నది తీర గ్రామమైన అల్లెనను సందర్శించారు. ప్రజాశక్తిలో తరలిపోతున్న ఇసుక అనే వార్త ప్రచురితం కావడంతో స్పందించిన తహశీల్దార్ అల్లెన గ్రామంలో డంపింగ్ చేసిన ఇసుకను పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఇసుక తరలింపుపై నిఘా పెట్టడం జరుగు తుందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలించేందుకు ప్రయత్నం చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

'ఆపరేటింగ్ సిస్టమ్స్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల సిఎస్ఇ, సిఎస్ఎం విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్న జి.విజయ్కుమార్, వి.యమునలు నూతనంగా రచించిన 'ఆపరేటింగ్ సిస్టమ్స్' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం తన కార్యలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ పుస్తక ఆవశ్యకతను వివరిస్తూ కంప్యూటర్ సైన్స్, ఆధారిత కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే మరిన్ని పుస్తకాలను రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెండ్డీ డీన్ డాక్టర్ డి.శ్రీరాములు, హెచ్‌డిలు వై.రమేష్, డాక్టర్ ఎం.వి.బి.చంద్రశేఖర్, అధ్యాపకులు డాక్టర్ టి.మురళీమోహన్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలు

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి వ్యక్తి అహంకారాన్ని విడనాడితే ఉన్నతికి చేరుకోగలరని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని చౌకబజార్ రోడ్డులో ఉన్న అవతార్ మెహెర్ బాబా కేంద్రంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ప్రతిఒక్కరికి ఎత్తు పల్లాలు సహజమని, సంఘర్షణ, సందేహం, త్యాగం ఉన్న నాడే అందరి మనసుల్లో చోటు దక్కించుకోగలరన్నారు. ఈ సందర్భంగా 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో అవతార్ మెహర్‌బాబా కేంద్రం అధ్యక్షులు పివి రంగప్రసాద్, కేంద్రం సెక్రటరీ వరప్రసాద్, గౌరవాధ్యక్షులు గుడ్ల సత్యన్నారాయణ, ట్రెజరర్ మెహెర్ సుధాకర్, ఉపాధ్యక్షులు రాజు, జాయింట్ సెక్రటరీ సురేష్ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలను అందుకుంటున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు తెలుగు భాషా పురస్కారం

ప్రజాశక్తి- పలాస

స్థానిక జన జాగృతి సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి తెలుగు భాషా పురస్కారం లభించింది. ఈ నెల 18న ఐఎస్ఒ గుర్తింపుపొందిన సాహిత్య, సాంస్కృతిక, సామజిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం అంబేద్కర్ సామాజిక భవనంలో తెలుగు భాషా దినోత్సవ సంబరాలు, 138 వ జాతీయ శతాధిక కవిసమ్మేళనం కార్యక్రమాలు నిర్వహించారు. నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు, పలాసకు చెందిన కవి శ్రేష్ట డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి 'స్వర్గం కన్న నా భారత్ మిన్న' అను కవితా గానం చేశారు. దీనికి చేసి ప్రశంసలు, సన్మానాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్, జనజాగృతి, ఉద్దానం సాహితీ వేదిక, లలిత కళారంజని అధ్యక్షులు హనుమంతు ఎండుదొర, కుమార్ నాయక్, లండ రుద్రమూర్తి, చిన్నాచారిలు తదితరులు అభినందనలు తెలిపారు.

పని సర్దుబాటుపై నిరసన

ప్రజాశక్తి- కవిటి

రాష్ట్ర విద్యాశాఖ ఆదివారం విడుదల చేసిన పని సర్దుబాటు నియమ నిబంధనలను మండలంలోని ఉపాధ్యాయులు సోమవారం విధులను బహిష్కరించారు. ఈ మేరకు ఎంఇఒ. ధనుంజయ మజ్జి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రాఫ్ట్‌లో 117 జిఒలోని అంశాలు మూడు నుంచి పదో తరగతి వరకు, ఆరు నుంచి పదో తరగతి వరకు రోలును బట్టి కాకుండా పాత పద్ధతిలో సెక్షన్ల విధానాన్ని బట్టి మిగులు ఉపాధ్యాయులను లెక్కించడం లేదన్నారు. మూడు నాలుగు ఐదు తరగతుల విలీనాన్ని రద్దు చేయకపోవడం, సక్సెస్ పాఠశాలల్లో తెలుగు, ఆంగ్లం, మైనర్ లాంగ్వేజెస్ సమాంతర మాధ్యమాలను గుర్తించకుండా మిగులు ఉపాధ్యాయులను లెక్కించలేదని తెలిపారు. పని సర్దుబాటుకు ముందు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. వాటిని పట్టించుకోకుండా రాష్ట్ర విద్యాశాఖ పనిసర్దుబాటుకు తయారు కావడానికి ప్రయత్నించడం విద్యారంగానికి నష్టమన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో, పోర్టో, జాక్టో మండల నాయకులు పాల్గొన్నారు.

టెక్కలి : ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయ సంఘాలు విధులను బహిష్కరించాయి. స్థానిక మండల రీసోర్సు కార్యాలయం వద్ద ఎంఇఒలు దల్లి తులసిరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు సమన్వయ సమావేశం నిర్వహించారు. మండలంలోని 9 ఉన్నత పాఠశాలలకు సబ్జెక్టు ఉపాధ్యాయులు అవసరమని, 54 మంది మిగులులో ఉన్నారని తెలిపారు. అనంతరం ఎంఇఒలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, ఎపిటిఎఫ్ నాయకులు బొడ్డేపల్లి నేతాజీ, గుంత శ్రీనివాసరావు, ఆది నారాయణ, ఆపస్ సంఘ నాయకులు కర్రి వేణు గోపాలరావు, కృష్ణారావు, మోహనరావు, అడ్డా సురేష్ పాల్గొన్నారు.

మందస : సర్దు బాటుకు నిరసనగా ఎంఇఒలు లక్ష్మణరావు, భాస్కరరావులకు ఉపాధ్యాయ సంఘ నాయకులు గవ్వ భీమారావు, వి.మురళి, జె.రవికుమార్, దుర్గాప్రసాద్ పాణిగ్రహి, జగదీష్ బడిత్య, ప్రభాకర్ పట్నాయక్, బమ్మిడి బైరాగి, ఎం.రాము, మాధవరావు, చిత్రసేన్, సత్యా నంద బెహరా, ఎం.శాంతి, పి.కృష్ణారావు, ఎస్.ప్రసాద్, పి.రమ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ఉపాధ్యాయుల పని సర్దుబాటు పేరుతో రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన నియమ నిబంధనల డ్రాఫ్ట్‌లో 117 జిఒలో ఉన్న అంశాలేనని, మూడు నుంచి పదో తరగతి వరకు, ఆరు నుంచి పదవ తరగతి వరకు రోల్‌ను బట్టి కాకుండా పాత పద్ధతిలో సెక్షన్ల విధానాన్ని బట్టి మిగులు ఉపాధ్యాయులను లెక్కించడం నష్ట దాయకమని ఉమ్మడి ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం చేపట్టిన సర్దుబాటు ప్రక్రియను వ్యతిరేకించారు. పూజారి హరి ప్రసన్న, పేడాడ కృష్ణారావు పాల్గొన్నారు.




టెక్కలి : వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు: ప్రభుత్వం చేపడుతున్న పని సర్దుబాటును వ్యతిరేకిస్తూ ఐక్యఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో వివిధ సంఘాలు ఎంఆర్‌సి కార్యాలయం ఆవరణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఎంఆర్‌సి కార్యాయంలో జరిగిన పని సర్దుబాటు కార్యక్రమాన్ని ఫ్యాప్టో, జాక్టో, పోర్టో సంఘాల ఉపాధ్యాయులు బహిష్కరించారు. అనంతరం ఎంఇఒలు రామరాజు, రాజారావులకు వినతి పత్రాన్ని అందజేశారు. నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎం.రమణరావు, తేజేశ్వరరావు, జి.గోపాలరావు, కెవివిఎం సత్యనారాయణ, జి.రామారావు, ఉపేంద్ర, ఎ.రవి, కె.విజయ్‌కుమార్, డి.శ్రీనివాసరావు, జి.మధుబాబు, జవహర్‌గుప్త, బి.సతీష్ పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సోమవారం మంగళగిరి పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో డిఐజి కమ్యూనికేషన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌జె.లక్ష్మి, భర్త వెంకట రమణ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ బిఎస్ చక్రవర్తి స్వామి చిత్రపటాన్ని అందజేశారు.



చిత్రపటాన్ని స్వీకరిస్తున్న లక్ష్మి, వెంకటరమణ దంపతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- జి.సిగడాం

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా మడ్డువలస నుంచి వచ్చే ఖరీఫ్‌కు నీరందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లావేరు మండలం బుడుమూరు పెద్ద చెరువును రిజర్వాయర్‌గా మార్పు చేసి మడ్డువలస నీరు తరలిస్తే రెండు మండలాలు సస్యశ్యామలమ వుతాయన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని, కేవలం వాలంటీర్ల

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి

ద్వారా పాలన సాగించి సర్పంచ్‌లకు ప్రాధాన్యత లేకుండా చేసిందన్నారు. కేంద్రం ఇచ్చిన జల జీవన్ మిసన్ కూడా వినియోగంలోకి రాకపోవడంతో తాగునీటి సమస్య కూడా తీరలేదన్నారు. అనంతరం పలు శాఖల పని తీరును సమీక్షించారు. పాఠశాలల వద్ద భవనాలు, వంటషెడ్లు, మరుగుదొడ్లకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులకు ఎరువులు కొరత లేకుండా చూడాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. ఈ నెల 23న అన్ని గ్రామాల్లో జరిగే ఉపాధి గ్రామ సభల్లో అన్ని రకాల పనులు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు మాట్లాడుతూ ఎన్‌డిఎ ప్రభుత్వం అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకన్న బాబు, ఎంపిపి మీసాల సత్యవతి, ఎంపిపి ప్రతినిధి వెంకట రమణ, టిడిపి మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, వైద్యాధికారి యశ్వత్ కుమార్, ఎలక్ట్రికల్ ఎఇ తిరుపతిరావు, ఎపిఎం రామకృష్ణ నాయుడు, ఎంఇఒ అరసాడ రవి, ఎపిఒ సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- కంచిలి

ఎపి సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన 19 ఏళ్లు నిండిన వయోజనులకు ఎటువంటి విద్యా అనుభవం లేకున్నా పది, ఇంటర్ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఇఒ శివరాం ప్రసాద్ కోరారు. ఈ మేరకు స్థానిక ఎంఆర్‌సి భవనంలో వెలుగు సిఎఫ్‌తో, సిసిలతో, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సోమవారం అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యావంతులుగా మారాలని లక్ష్యంతో ప్రభుత్వం ఓపెన్ తరగతులు నిర్వహిస్తున్నదన్నారు. ఈ నెల 28లోగా అర్హులైన వారు ఆన్‌లైన్‌లో గాని, ఇచ్ఛాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో నేరుగా దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. రాత పరీక్ష అనంతరం ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ధ్రువపత్రాలు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.



సరుబుజ్జిలి కూడలిలో ప్రొక్లెయినర్‌తో చేపడుతున్న పనులు

గోతులు పూడ్చివేత

సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశాలతో రోడ్లు భవనాల శాఖ అధికారులు సోమవారం పనులను చేపట్టారు. ఆదివారం సరుబుజ్జిలి మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే రవికుమార్ రహదారిపై ఉన్న గుంతలను చూసి వీడియో కాల్ ద్వారా ఆర్అండ్‌బి ఉన్నత అధికారులకు తెలియజేస్తూ తక్షణమే పూడ్చివేత పనులతో పాటు రహదారి పూర్తిస్థాయి అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆర్అండ్‌బి అధికారులు ఆర్‌టిసి బస్‌స్టేషన్ వద్ద ఉన్న భారీ గుంతలో మట్టిని తొలగించి వెట్ మిక్స్ చేసి వాహనాల రాక పోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే శివాలయం వద్ద పూర్తిగా కల్వర్టు కృంగిపోయి భారీగా వరద నీరు, మురుగునీరు నిలిచి పోయి వాహనాల రాకపోకలకు ఇటీవల కాలంలో తీవ్ర అంతరాయం ఏర్పడేది. దానిని కూడా అధికారులు యంత్రాలతో పూర్తిగా తీసివేసి కొత్తగా సిమెంట్ పైపులతో కల్వర్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

నేడు పోలాకి మండల సమావేశం

పోలాకి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఉషశ్రీ తెలిపారు. ఈ మేరకు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎంపిపి ముద్దాడ దమయంతి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి విధిగా ప్రజా ప్రతినిధులు, పూర్తి సమాచారంతో మండలస్థాయి అధికారులు పాల్గొవాలని సూచించారు. అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ దేవరాజు పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- హిరమండలం

స్థానిక బ్రహ్మణవీధిలో మించుల నారాయణమ్మ భర్త ఇటీవల మృతి చెందారు. ఇద్దరి ఆడపిల్లలతో పేదరికం అనుభవిస్తుంది. దీంతో పెద్ద అమ్మాయికి వివాహం నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న జనసేన నియోజకర్గ నాయకులు కొరికాన రవికుమార్, భవాని దంపతులు పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఆర్థికసాయం సోమవారం అందించారు. కార్యక్రమంలో క్రాంతికుమార్, రామకృష్ణ, వికాస్, హరీష్, జీవన్ పాల్గొన్నారు.

కంచిలి : మండలంలోని కర్తలికి చెందిన పైల తాతయ్య, ధనలక్ష్మిల కుమారుడు రిషి కేశవ్ (3ఏళ్లు) కేన్సర్‌తో బాధపడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న కంచిలి విజ్ఞాన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు చిన్నారి చికిత్స కోసం రూ.20 వేలు ఆర్థికసాయం సోమవారం అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆదినారాయణ, ప్రిన్సిపాల్ ఉమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కవిటి: కడుపులో కణితితో బాధపడుతున్న పెద్ద బల్లిపుట్టుగకు చెందిన రెండేళ్ల చిన్నారి మేనక చాందినికి స్థానిక అన్నవరం హెల్పింగ్ హేండ్స్ సంస్థ అండగా నిలిచింది. ప్రస్తుతం రాగోలు జెమ్స్‌లో చికిత్స పొందుతున్న చాందిని వైద్యం కోసం కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న అన్నవరం హెల్పింగ్ హేండ్స్ సభ్యులు చిన్నారి అమ్మమ్మకు సోమవారం రూ.6 వేలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ దయనీయ స్థితిలో ఉన్న చాందిని కోసం దాతలు ఉదారంగా విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో లలిత, రాజేష్, ప్రవీణ్, దినేష్, మణి, కుసుమ పాల్గొన్నారు.



హిరమండలం : ఆర్థికసాయం అందజేస్తున్న రవికుమార్ దంపతులు

హెచ్ఐవిపై అవగాహన

మందస : హెచ్ఐవిపై అవగాహన కలిగించాలని ప్రాజెక్టు మేనేజర్ పి.మాధవరావు అన్నారు. మండలంలోని హరిపురం శాతవాహన జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, డిఎపిసియు సహకారంతో యూత్ క్లబ్ బెజ్జిపురం ఆధ్వర్యాన సోమవారం 'మీకు తెలుసా' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బి. శివ, ఎఒ ఎం.భాస్కరరావు, ప్రిన్సిపాల్ బి. శాంతారావు, ఎన్.రాంకుమార్, ఎం.మాధవరావు పాల్గొన్నారు.

ముగిసిన పాఠశాలల సముదాయం

టెక్కలి : ఎంఇఒల దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావుల పర్యవేక్షణలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పాఠశాలల సముదాయాలు సోమవారంతో ముగిశాయి. సబ్జెక్టు సముదాయాలు నందిగాం మండలంలోని నౌగాం, పెద్దతామరాపల్లి, తురుకలకోట జిల్లా పరిషత్ పాఠశాలల ఆవరణలో ఆయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యాన నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల సముదాయాలు, టెక్కలి మండలంలోని సీతాపురం, తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ వద్ద నిర్వహించారు. సముదాయాల్లో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్



కవిటి : రాఖీ కడుతున్న సత్యకీర్తి

పలాస: అక్కాచెల్లెళ్లకు మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలిపారు. అన్నా చెల్లెల్ల అను బంధాలకు, అనురా గాలకు, ఆప్యాయతలకు పండగ రోజు ఇది అన్నారు. అలాగే ఇటీవల కలకత్తాలోని వైద్యురాలపై జరిగిన అమానుషమైన ఘటన ఎంతో కలచి వేసిందన్నారు.

అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల మధ్య అనుబంధం, ఆప్యాయతలకు ప్రతీక రక్షా బంధన్ అని సత్యసాయి విద్యా విహార్ ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం సత్య సాయి విద్యావిహార్ విద్యార్థులు సోమవారం రాఖీ పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా పిఇటికిరణ్ దర్శకత్వంలో రక్షా బంధన్ ఆకృతిలో దర్శనమిచ్చి అందరినీ అబ్బురపరిచారు.

బంగారు రాఖీ తయారీ

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 21వ వార్డు గాంధీ నగర్‌కు చెందిన అంతర్జాతీయ సూక్ష్మ కళాకారులు అతి సూక్ష్మ బంగారు రాఖీను రాఖీ పౌర్ణమి సందర్భంగా వినుత్న రీతిలో తయారు చేశారు. పలాస వాసి కొత్తపల్లి రమేష్ ఆచారి దీని తయారీకి సుమారు రెండు గంటలు పట్టినట్లుగా తెలియజేశారు, దీని ఎత్తు కేవలం అర సెంటీమీటర్‌గా తెలియజేశారు. బియ్యం గింజంత సైజులో పలుచటి బంగారపు రేకు పైన ఎటువంటి అతుకులు లేకుండా అతి చిన్న సూక్ష్మ స్వర్ణ రాఖీని తయారు చేసినట్లుగా కళాకారులు తెలియజేశారు. ఇది కేవలం 0.10 మిల్లీగ్రామ్‌లో బరువు కలిగి ఉంది. రూ.70 విలువగల బంగారంతో తయారు చేసినట్లుగా కళాకారులు తెలియజేశారు.


మెళియాపుట్టి : సమాజంలోని ప్రతి ఆడపిల్లపై సోదరి భావంతో మెలగాలని, తద్వారా వారిపై విద్వేషాలు, అఘుత్యాలు తగ్గుముఖం పడతాయని నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.జె.ఎస్.ప్రతాప్ అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని విద్యార్థినులకు విద్యార్థులు రాఖీలు కట్టారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ఇన్నీస్‌పేట మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయులు రక్షా బంధన్ విశిష్టత గురించి వివరించారు. హెచ్‌ఎం ఎం.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు బి.శంకరం, దాశరథి, తారక్ పాల్గొన్నారు.

మందస : ఎంపిపి డొక్కరి దానయ్య తన చెల్లెలకు రాఖీ కట్టారు. అన్నా – చెల్లెళ్లు, అక్కా – తమ్ముళ్ల మధ్య ఆప్యాయత, అనురాగ బంధమే రక్షా బంధన్ అని అన్నారు. నికు అండగా, దండగా, కష్ట సుఖాల్లో కలకాలం తోడుంటానన్నారు.

పోలాకి: అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ళ అనుబంధానికి ప్రతీకైన రక్షా బంధన్ వేడుకలు వాడవాడలా వేడుకగా జరుపుకున్నారు. తమ్ముళ్లు, అన్నయ్యలకు అక్కా చెల్లెళ్లు రక్షా బంధన్ కట్టి మిఠాయిలు తినిపించారు. మండలంలోని మబగాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి బ్రహ్మ కుమారీ సోదరీమణులు రాఖీ కట్టారు.

పాతపట్నం: ఎమ్మెల్యే రెడ్డి శాంతి రాఖీ పౌర్ణమి సందర్భంగా పాలకొండలోని తన సోదరుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కి రాఖీ కట్టారు. సోదర సోదరీమణుల ప్రేమకు ప్రతిరూపంగా జరుపుకునే అపురూపమైన వేడుక రాఖీ పండుగ సందర్భంగా ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



పలాస : రాఖీ ఆకృతిలో విద్యార్థులు

మోడల్ స్కూల్‌లో రక్షాబంధన్‌లో భాగంగా ఆవరణలోని ఓ చెక్కుటకు రాఖీ కట్టారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించు కోవడం ద్వారా మనల్ని మనం సంరక్షించు కుందామని అనే సందేహాన్ని విద్యార్థులకు తెలియజేశారు.

కవిటి: కల్యాణి ఆంగ్ల పాఠశాల, బివికె విద్యార్థులు తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పోస్టు మాస్టర్‌కు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.

లావేరు: మండలంలోని బుడుమూరు జెడ్‌పి పాఠశాలలో సోమవారం ఎపిఎన్‌జిసి ఆధ్వర్యంలో చెట్లు ఆవశ్యకతను తెలియజేస్తూ చెట్లుకు రాఖీలు కట్టారు. పాఠశాల హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు, ఎపిఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు ఉపాధ్యాయులు కూన చిన పెంటయ్య, రమేష్ బాబు, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐ సువ్వారి రామచంద్రరావు, సిబ్బందికి విద్యార్థినులు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సీనియర్ నాయకులు సిహెచ్ రాజు, పొందూరు కమిటీ సభ్యులు శ్రావణి, అశ్రీజ, లావణ్య, పావని, స్నేహ, వనజ, పవిత్ర, లిఖిత, భానుప్రీతి తదితరులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న ప్రసాద్

వ్యక్తిపై దాడి

ఎచ్చెర్ల : మండలం ఫరీదుపేటలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా కర్రలతో ఓ వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి చేశారు. విషయాన్ని గమనించిన కొందరు ఆ వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. పోలీసుల వివరాల మేరకు పరీధుపేటకు చెందిన కూన ప్రసాద్ ఫరీదుపేట ఉప సర్పంచ్ సత్తారు గోపి దగ్గర కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 2024 సాధారణ ఎన్నికల నుంచి

క్రైమ్ కార్నర్

గ్రామంలో చిన్న చిన్న గొడవలు అవుతున్నాయి. గత వారం రోజుల క్రితం జరిగిన విద్యాకమిటీ ఎన్నికల్లో కూడా గొడవలు జరిగియి. అయితే ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో ప్రసాద్ బహిర్భూమికి తన బైక్‌పై వెళ్తుండగా కాలనీ మూడవ వీధి దగ్గర అప్పటికే మాటు వేసి ఉన్న తమ్మినేని అన్నాజీరావు, కూన శ్రీనివాసరావు, కొత్తకోట శివకుమార్, కొత్తకోట ఈశ్వరరావు, సీపాన శివకుమార్, గురువుబెల్లి మురళీకృష్ణ, కొత్తకోట అప్పన్న, కొత్తకోట సూర్యనారాయణ, కొత్తకోట కృష్ణారావు, పైడిపెద్ది వేణు, కొత్తకోట రాజా, కొత్తకోట అనిల్‌తో పాటు మరి కొంతమంది కలిసి బైక్‌పై వెళ్తున్న ప్రసాద్‌ను కర్రలతో విచక్షణారహితంగా కొట్టగా ప్రసాద్ భయపడి పరిగెత్తుకుంటూ దగ్గరలో సౌర కృష్ణమూర్తి మేడపైకి వెళ్లిపోగా వారు కూడా వెంబడించి డాబా ఇంటిపైకి వెళ్లి కొట్టడంతో ప్రసాద్ తలకు బలమైన గాయాలుకాగా, కాళ్లకు చిన్నచిన్న గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడు ప్రసాద్‌ను 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేసినట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ముద్దాయిలపై మర్డర్‌గా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దాడి ఘటన తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న కూన ప్రసాద్‌ను సోమవారం పరామర్శించారు. ఈయనతో పాటు వైసిపి నాయకులు మొదలవలస కృష్ణ, సత్తారు గోపి, సీపాన దిలీప్ కుమార్ తదితరులున్నారు.

అంగన్వాడీ కార్యకర్త మృతి



స్వప్న (ఫైల్)

పొందూరు: ఎంతోమంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రాధాన్యత తెలియజేయడంతో పాటు గర్భస్థ శిశువు పెరుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించింది. దీంతో ఆరోగ్యవంతమైన శిశువులు పుట్టేందుకు తనవంతు తోడ్పాటు అందించింది. కాని విధి వంచితురాలై తన గర్భంలో శిశువు పెరుగుదలలో లోపం కారణంగా తాను అనారోగ్యానికి గురై మృత్యువుతో పోరాడి ఓడిపోయింది ఆ అంగన్‌వాడీ కార్యకర్త. మండలం వి.ఆర్.గూడెం అంగన్‌వాడీ కార్యకర్త కె.స్వప్న (25) సోమవారం శ్రీకాకుళంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో అనారో గ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనికి సంబంధించి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మృతురాలు 5 నెలలు గర్భిణీ కావడంతో శ్రీకాకుళంలోని ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ తరుణంలో గర్భస్థ శిశువు పెరుగుదలలో లోపం తలెత్తడంతో ఆమె అనారోగ్యానికి గురైంది. దీంతో గర్భాన్ని తొలగించాల్సిన పరిస్థితి నెలకొనగా ఈ తరుణంలో అధిక రక్తస్రావం జరిగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతు రాలికి భర్త అసిరినాయుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. చిన్న వయసు లోనే ఈమె మృతి చెందడంతో భర్తతో పాటు కుటుంబ సభ్యులు రోధనను ఆపడం ఎవరితరం కాలేదు. విషయం తెలుసుకున్న మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు గ్రామానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

నలుగురు అరెస్టు

తొమ్మిది బైకుల స్వాధీనం

ఆమదాలవలస: జిల్లాతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గొంప వాయునందన్ దివాకర్ యాదవ్ తెలిపారు. సోమవారం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో సిఐ మాట్లాడుతూ పట్టణంలోని పార్వతీశం పేట జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మూడు బైకులపై నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా తారస పడడం జరిగిందని వారిని పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి విచారించగా బైకులు దొంగలించి ఒడిశా రాష్ట్రంలో విక్రయాలు జరుపుతామని అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మరో ఆరు బైకులు కూడా దొంగలించినట్లు విచారణలో తెలియజేసినట్లు సిఐ తెలిపారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఈ నలుగురు నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ కె.వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.



నిల్వ ఉన్న వర్షపునీరు

వర్షపునీటి నిల్వతో అవస్థలు

నరసన్నపేట: పట్టణంలో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ ఉండడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలో అనేక వీధుల్లో నీరు నిల్వ ఉండి వాహనాలు, మనుషులు నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. పట్టణంలోని బొంతలవీధి, కంబకాయి కూడలి, కొత్తవీధి, మార్కెట్ వీధి, వీరన్నాయిడు కాలనీ, బండి వీధి, గాంధీనగర్, తహశీల్దార్ కార్యాలయ ఆవరణ, ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆరవణ ఇలా అన్ని వీధుల్లో నీరు చేరి నిల్వ ఉండిపోతుంది. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో జ్వరాల బారిన పడుతున్నారు.

హత్యాచార ఘటనపై నిరసన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పొందూరు: కలకత్తాలోని ఆర్‌జి గర్ ఆస్పత్రిలో మెడికోపై జరిగిన హత్యాచారం సంఘటనను నిరసిస్తూ మండలం గోరింటలో సర్పంచ్ చింతాడ శ్రీలక్ష్మి, కూన వెంకటరావు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన నింధితులను కఠినంగా శిక్షించి ఆమె కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో టిడిపి బిసి సెల్ అధ్యక్షులు చింతాడ కృష్ణ వాసుదేవరావు, విద్యాకమిటీ ఛైర్మన్ బాడాన భాస్కర రావు, చింతాడ అప్పలనాయుడు, చింతాడ శ్రీధర్, గాయిత్రి, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, వెంకట రమణ, పాపారావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1968-69లో హయ్యర్ సెకండరీ పన్నెండో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక సిస్టం కళాశాలలో పూర్వ విద్యార్థి డాక్టర్ మందుల మోహనరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పరస్పరం కలుసుకుని ఆత్మీయతతో యోగక్షేమాలను తెలుసు కున్నారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన వారిలో మృతిచెందిన ఉపాధ్యాయులు, సహోపాధ్యాయులను గుర్తు చేసుకుని రెండు నిమిషాలు పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో లయన్ వడ్డిపల్లి సూర్యనారాయణ, ఎం.వెంకటరావు, బలివాడ రామ్మోహన రావు, కె.వి.రమణారావు, బల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

రాజేశ్వరికి న్యాయం జరిగేవరకు పోరాటం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఒంటరి దళిత మహిళా ఉద్యోగి రాజేశ్వరికి న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామని దళిత హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాజేశ్వరి సంఘ సహచరులైన భాస్కర్ ఆమెకు రీ పోస్టింగ్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, సామాజిక పరంగా, ఆర్థిక పరంగా, అంగబలంతో హింసిస్తే సహించేది లేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలను వేధింపులకు గురిచేస్తే ఎంతవరకైనా వెళ్తామన్నారు. భాస్కర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, రాజేశ్వరికి న్యాయం జరిగే వరకు దళిత హక్కుల పరిరక్షణ సమితి ద్వారా అండగా నిలుస్తామన్నారు. ఈ విషయాన్ని ఎస్‌పి మహేశ్వర రెడ్డి దృష్టిలో పెట్టామని, సానుకూలంగా స్పందించిన ఎస్‌పి న్యాయం జరిగేలా చూసి, తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారన్నారు. సమావేశంలో మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ నూతలపాటి భరత్ భూషణ్, దళితహక్కుల పరిరక్షణ జిల్లా అధ్యక్షులు పోతుల దుర్గారావు, అలికాన రాజేశ్వరి, ఎన్ శ్యామ్ సుందర్, డేనియల్, ధనరావు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

64 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- మందస

స్థానిక కంచమై కాలనీలో కొద్ది రోజులుగా జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మందస పిహెచ్‌సి వైద్య సిబ్బంది సోమవారం 64 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. రక్తనమూనాలను పరీక్షించి లేబొరేటరీకి పంపించారు. వేడి నీరు, ఆహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోషి, పెంటమ్మ, ఎస్.రుక్మిణ, సూపర్‌వైజర్ సోమేశ్వరి, విజయవాణి, పి.పుష్పలత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పులిహోరా ప్యాకెట్ల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సినీ నటుడు చిరంజీవి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో సోమవారం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఆయన అభిమానులు పులిహోరా ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ప్రారంభించారు. సేవా కార్యక్రమాల్లో చిరంజీవి కుటుంబ నటీనటుల అభిమానులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. కార్యక్రమంలో నాగరాజు, మణికంఠ, మజ్జి గౌతమ్, నవీన్, గిరి, కిరణ్ కిర్రు, పెయ్యల చంటి, జోగిపాటి వంశీ, శీర రాజు, చల్లా అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

సంతబొమ్మాళి: మండలంలోని ఉమిలాడకు చెందిన విశ్రాంత ఆర్మీ జవాన్ మూగు కృష్ణమూర్తి తన తండ్రి, మాజీ సర్పంచ్ దాలయ్య జ్ఞాపకార్థం ఉమిలాడ మండల పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలకు సోమవారం బీరువాను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో కోడ షణ్ముఖరావు ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బీరువాను అందజేస్తున్న కృష్ణమూర్తి

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి- రణస్థలం

విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలిగి ఉన్నత విజయాలు సాధించాలని ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి సూచించారు. కోష్ట సచివాలయ మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, డిబేటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం మండల అధికారులు ఎంపిడిఒ కార్యాలయంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మోజీ మాట్లాడుతూ వశిష్ఠ స్పోకెన్ ఇంగ్లీష్ వారి సహకారంతో రూ.500 విలువ చేసే మెటీరియల్‌ను విజేతలకు, అతిథులకు అందజేశామన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపిడిఒ

అమ్మోజీకి అభినందనలు

ఆగస్టు 15న విశ్వభారత్ వీర పురస్కార్ అవార్డును విశాఖపట్నంలో మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి, ఎఒ వి.ధనుంజయరావు, సిడిపిఒ ఝాన్సీ, ఎఎస్ఐ సిహెచ్.లక్ష్మణరావు, కార్యదర్శులు ఆర్.శ్రీధర్, వి.చంద్రశేఖర్, హైదర్ అలీ సోమవారం ఘనంగా సత్కరించారు. వృత్తితో పాటు ప్రవృత్తిలోనూ రాణిస్తున్న అమ్మోజీ భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. టెక్కలి మండలం పోలవరానికి చెందిన ఆమె కోష్ట సచివాలయంలో మహిళా పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నారు. తెలుగు తేజం, శ్రీశ్రీ ప్రతిభా పురస్కారం, సేవారత్న తదితర జాతీయ పురస్కారాలను అందుకోవడం తో పాటు 48 గంటల కళాకారుల ప్రదర్శన ఏర్పాటు చేసి నాలుగు వరల్డ్ రికార్డుల్లో ఆమె పేరు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో కొండములగాం మోడల్ స్కూల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కోష్ట, విఎన్ పురం తదితర పాఠశాలల యాజమాన్యం, వెల్ఫేర్ అసిస్టెంట్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శాంతి స్థాపనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుల ఉద్యోగ భవనం నుంచి జిల్లా పరిషత్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం చేపట్టారు. పశ్చిమబెంగాల్‌లో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం, శ్రీకాకుళం మానవత డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ జానకి రామరాజు, జిల్లా చైర్మన్ డి.విష్ణుమూర్తి, వైస్ చైర్మన్ నటుకుల మోహన్, కన్వీనర్ పార్వతీశం, విశ్రాంత ఉపాధ్యాయులు, ఆడపిల్ల ఫౌండేషన్ అధ్యక్షురాలు లావణ్య, సభ్యులు ఉర్లం శివతేజ, టి.అప్పల నాయుడు, రాంగోపాల్, జోగి రాజు, జోగి భారతి, మాధవి, పొడుగు చరణ్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

జీవామృతంతో అధిక దిగుబడులు



ఆమదాలవలస : జీవామృతం తయారు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

జీవామృతంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని డిజిటల్ ఎల్‌టు సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల్లో పంటలకు జీవామృతాన్ని రైతులతో వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవామృతాన్ని రైతులతో తయారు చేయించి పంటలకు అందిస్తున్నట్లు తెలిపారు. జీవామృతం పంటకు అందించడం వలన నేలలో పంటకు కావాల్సిన పోషకాలు అంది పైరు ఎదుగుదలకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది మంచి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను ఎంటి సూర్యనారాయణ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. అంగాకర కాయ, చిక్కుడు, దొండకాయలు, నిమ్మకాయలు, తోటకూర, గోంగూర కట్టలు, బెండ కాయలు, బీరకాయలు అమ్మకాలు చేపట్టారు. వచ్చేవారం ఆంగాకర కాయ, ఆర్గానిక్ బెల్లం కావాలని వినియోగదారులు కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి చిన్నమ్మి, ఐసిఆర్‌పిలు రమణమ్మ, ముఖలింగం, వెలుగు సిసిలు గోవిందరావు, ప్రమీల పాల్గొన్నారు.



కొత్తూరు : విక్రయిస్తున్న సూర్యనారాయణ

మహిళలపై సోదరిభావాన్ని అలవర్చుకోవాలి



నిత్యావసర సరకులు అందజేస్తున్న డాక్టర్ సురేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి ఆడపిల్లపై సోదరి భావంతో మెలగాలని తద్వారా వారిపై విద్వేషాలు, అఘత్యాలు తగ్గుముఖం పడతాయని లయన్స్ క్లబ్స్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన నిరుపేదలకు నిత్యవసర కిట్లు సోమవారం పంపిణీ చేశారు. కోల్‌కత్తాలో మహిళా డాక్టర్‌పై హత్యాచార ఘటన హృదయ విదారకమన్నారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జెడ్‌సి పొన్నాడ రవికుమార్, డాక్టర్ దేవభూషణరావు, ట్రెజరర్ భారతి, సభ్యులు రాంగోపాల్ పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ ఫొటోలు అందజేత

ప్రజాశక్తి- పలాస

ఆర్‌డిఒ, తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాలకు, పోలీస్‌స్టేషన్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటోను జనసేన నాయకుడు నందిగాం ధర్మారావు సొంత ఖర్చులతో సోమవారం అందజేశారు. ఆర్‌డిఒ భరత్ నాయక్, తహశీల్దార్ పి.సత్యంకు, ఎస్ఐలను కలిసి వీటిని అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, దీనపాత్రో, బంగారి కేదారనాథ్, పట్టి ఉదయ్‌కిరణ్, దిలీప్ పాత్రో, కొల్లి చక్రపాణి, తోట ప్రశాంత్, సకలాబత్తుల శశి, సురంగి సురేష్ పాల్గొన్నారు.



పవన్ కళ్యాణ్ ఫొటోను అందజేస్తున్న ధర్మారావు

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

లూయిస్ డాగురే మండేలా185వ జన్మదినాన్ని పురష్కరించుకుని సోమవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని నటరాజ్ ఫోటో ఎంపోరియంలో సోమవారం పట్టణ అధ్యక్షులు పక్కి వేణు ఆధ్వర్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం పూర్వపు రాష్ట్ర అధ్యక్షులు మెట్ట నాగరాజు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డాగురే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రంలో ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం : ప్రపంచ ఫోటోగ్రాఫర్ల దినోత్సవాన్ని నియోజకవర్గ ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షులు తూలుగు భుజంగరావు ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. ముందుగా కెమెరా సృష్టికర్త 'లూయిస్ జాకేష్ ముండే డాగురే' చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ ఒసదర్భంగా మాట్లాడుతూ డాగురే చేసిన కృషి వల్లే ఇప్పుడు ఫొటోగ్రాఫర్లు తమ జీవితాలను కొనసాగిస్తున్నారని కొనియాడారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు పి.రాము, టి.వెంకటరావు, గోపీకృష్ణ పట్నాయక్, ఎస్.రమణ, ఎస్.జోగారావు, బి.మధు, ఖగేష్, ఎ.యస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

అభ్యసనా స్థాయి పెంపునకు కృషి

ప్రజాశక్తి- రణస్థలం

పాఠశాలలో విద్యార్థుల అభ్యసన స్థాయిలు పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ఎంఇఒ బి.లావణ్య అన్నారు. మండలంలోని పాతర్లపల్లి స్కూల్ కాంప్లెక్స్ పాఠశాల సముదాయ సమావేశాలు సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించాలని, పాఠశాల సముదాయ సమావేశాలను విద్యా వనరులుగా వినియోగించుకొని పాఠశాలలో విద్యార్థుల అభ్యసన స్థాయిలు పెంపొందించడానికి ప్రతిఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని, ఎల్ఐపి, టర్ల్, విద్యాప్రవేశ్, ప్రహరీ క్లబ్ ఏర్పాటు తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ వై.వసంత పాల్గొన్నారు.



రణస్థలం : మాట్లాడుతున్న ఎంఇఒ లావణ్య



సంతబొమ్మాళి : నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

సంతబొమ్మాళి: విద్యార్థులకు నైతిక విలువలు నేర్పేది శాంఘిక శాస్త్రమే అని బోరుభద్ర ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అన్నారు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పాఠశాల సముదాయ సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోరుభద్రలో నిర్వహించారు. ముందుగా ఇటీవల కలకత్తాలో వైద్య విద్యార్థిని హత్యకు గురైన ఘటనపై రెండు నిముషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ అంకితభావంతో బోధించి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. సాంఘిక శాస్త్రంలో నూతన పోకడలను ఉపాధ్యాయులు కె.తవిటిరెడ్డి, విష్ణు, బి.పాపారావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సముదాయ చైర్మన్ పి.రామకృష్ణ, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ఇచ్ఛాపురం: పశ్చిమబెంగాళ్ రాష్ట్రం కలకత్తాలో డాక్టర్ విద్యార్థిని హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని టిడిపి తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్ డిమాండ్ చేశారు. దీనికి నిరసనగా సోమవారం పట్టణంలోని బస్టాండ్ కూడలి నుంచి దాసన్నపేట, రథంవీధి, ఆస్పత్రి రోడ్డు, మళ్లీ బస్టాండ్ వరకు ప్లకార్డులు చేతబట్టి, నల్ల రిబ్బన్లు ధరించి ఫ్లెక్సీలతో మహిళలకు, స్కూల్ పిల్లలక రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తూ... ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. మున్ముందు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కళ్ల ధర్మారావు, నందిక జాని, దక్కత ఢిల్లీరావు, జన్నెల సంతోష్, రోటరీ ప్రతినిధులు దక్కత కృష్ణమూర్తిరెడ్డి, మధుకుమార్, లీలారాణి, జిలానీ, నందిగాం కోటి, జెసిఎస్ అధ్యక్షులు షణ్ముఖరావు, శాంతి నికేతన్ విద్యా సంసల విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తెలుగువారి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బిలాయ్‌లోని తెలుగువారి అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన గంగాధర సేవా సంఘం అధ్యక్షుడు మడ్డు పాపారావు అన్నారు. సోమవారం బిలాయిలో జరిగిన ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. బిలాయిలో స్థిరపడిన డోకులపాడుకు చెందిన తెలుగు ప్రజలు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిలాయ్ నుంచి పలాస వరకు రైలు ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎన్నికలు అధికారి కర్రి ఉమాశంకరరావుతో పాటు సహాయక ఎన్నికలు అధికారిగా తండేలు బబ్లూ, మడ్డు అప్పారావు, మైలపల్లి ఈశ్వరరావు, కోనేరు పాపారావు తన వంతు బాధ్యతలు నిర్వహించారు. ఉపాధ్యక్షులు పప్పు ఎర్రన్న, ప్రధాన కార్యదర్శి వడ్డి అప్పారావు,ఉప ప్రధాని కార్యదర్శి మడ్డు ఆదినారాయణ, ఉప కార్యదర్శి వడ్డి కామేశ్వరరావు, కోశాధికారి పుక్కళ్ల కామేశ్వర రావు, ఉప కోశాధికారిగా కృష్ణ విజయం సాధించారు.



అభినందనలు తెలుపుతున్న సభ్యులు

భవానీశంకర్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గకు చెందిన మాజీ కౌన్సిలర్, వైసిపి నాయకులు డబ్బీరు భవానీ శంకర్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు, టిసిసిబి మాజీ డైరెక్టర్ సిర్ల రవిచంద్ర, బుజ్జి మృతుడు కుటుంబానికీ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు సోదరుడు డబ్బీరు నాగుతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారితో పాటు సాసుమాన చంద్రమౌళి, జగదీష్ పండా, యవ్వరి మోహనరావు, అంబికా ప్రసాద్ ఉన్నారు.



పరామర్శిస్తున్న నాయకులు